ఆంధ్రజ్యోతి

andhrajyothy.com బుధవారం ఉష్ణోగ్రత గరిష్ఠం 31.3, కనిష్ఠం 19.2



'ఐక్యతగా ఉంటేనే సమస్యల పరిష్కారం'

తాంసి, జనవరి 10: ఆయా గ్రామాలలోని బీసీ సంఘం కులస్తులు సంఘటితంగా ఉంటేనే సమస్యలకు పరిష్కారం లభిస్తుందని మండల బీసీ సంఘం అధ్యక్షుడు ఎక్కల గారి శ్రీనివాస్ గౌడ్ అన్నారు. బుధవారం మండలంలోని సావర్గావ్ గ్రామంలో సంఘం నాయకులతో ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యావంతులైనా యువత సంఘాల బలోపేతానికి కృషి చేయాలని కోరారు. బీసీలకు అన్యాయం జరిగితే సహించేది లేదన్నారు. ఎన్ని ఉద్యమాలకైనా బీసీ సంఘం నాయకులు సిద్ధంగా ఉండాలని ఆయన పిలుపునిచ్చారు.



● సిరికొండ మండలంలో ఇళ్లల్లో పత్తిని నిల్వ ఉంచిన రైతులు

'పత్తి అమ్మాలా..? వద్దా?!

- జిల్లాలో పత్తికి మద్దతుకు మించి ధర రాకపోవడంతో దిగుబడులను అమ్మేందుకు అనాసక్తి
- పత్తి దిగుబడి అంచనా 24 లక్షలు కాగా.. కొనుగోలు 10లక్షల 12వేల క్వింటాళ్లు
- ఇళ్లల్లోనే నిల్వ చేసుకుంటున్న రైతులు
- మార్కెట్‌కు నామమాత్రంగా దిగుబడులు
- ఈయేడు మద్దతు ధర రూ.7020
- గత నెల రోజులుగా క్వింటాలు పత్తికి కు రూ.6600 నుంచి రూ.7వేలు దాటని పత్తి ధర
- క్వింటాలు పత్తికి రూ.10వేల ధర చెల్లించాలని రైతుల డిమాండ్
- వేచిచూసే ధోరణిలో పత్తి రైతులు
- జిల్లావ్యాప్తంగా ఈయేడు 3లక్షల 45వేల ఎకరాల్లో సాగైన పత్తి పంట

ఆదిలాబాద్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి): జిల్లాలో పత్తికి మద్దతుకు మించిన ధర రాకపోవడంతో అన్నదాతలు అమ్మేందుకు ఆసక్తి చూపడం లేదు. చేతికి వచ్చినా.. పత్తిని ఇళ్లలోనే నిల్వ చేసుకుంటూ ధర కోసం ఎదురుచూస్తున్నారు. పంట కాలం ముగిసిపోతున్నా.. పత్తిని అమ్మేందుకు రైతులు ఊగిసలాడుతున్నారు. ప్రారంభంలో కొంత పర్వాలేదనిపించినా.. క్రమక్రమంగా ధరలు తగ్గుముఖం పడుతూ వస్తున్నాయి. ఈయేడు ప్రభుత్వ మద్దతు ధర రూ.7020 కాగా, గత నెల రోజులుగా క్వింటాలు పత్తి ధర రూ.6600 నుంచి రూ.7వేలను దాటడం లేదు. ప్రారంభంలో రూ.8300 పలికిన ధర రూ.1500 పైగా పడిపోయింది. జిల్లాలో పత్తి పంట ప్రధాన సాగవుతోంది. జిల్లా సాధారణ సాగు విస్తీర్ణం 5లక్షల 72వేల ఎకరాలు కాగా, ఈసారి 3లక్షల 45వేల ఎకరాలలో పత్తి పంట సాగైంది. దీంతో ఎకరాన 7 క్వింటాళ్ల అంచనాతో 24లక్షల క్వింటాళ్లకు పైగా పత్తి దిగుబడులు వస్తాయని వ్యవసాయ శాఖ అంచనా వేసింది. కానీ ఇప్పటి వరకు 10లక్షల 12వేల క్వింటాళ్ల పత్తిని మాత్రమే కొనుగోలు చేశారు. సీసీఐ 7లక్షల 3వేలు కాగా, ప్రైవేట్ వ్యాపారులు 3లక్షల 9వేల క్వింటాళ్లను కొనుగోలు చేశారు. ప్రైవేట్‌లో ధర లేకపోవడంతో ప్రభుత్వ మద్దతుధరకు సీసీఐలో పత్తిని అమ్ము కునేందుకు రైతులు నానాతంటాలు పడుతున్నారు. ఆధార్ లింక్ పేరిట పత్తిని కొనుగోలు చేసేందుకు నిరాకరిస్తున్నారు. దీంతో రైతులకు పత్తిని అమ్మేందుకు కష్టాలు తప్పడం లేదు. రోజుల తరబడి పత్తి డబ్బుల కోసం ఎదురుచూసే పరిస్థితులు ఎదురవుతున్నాయి. కొనుగోళ్లకు కొర్రీలు పెట్టడంతో రైతులు దళారులను ఆశ్రయిస్తూ మోసపోతున్నారు.

ధర పెరుగుతుందన్న ఆశ

ధర మరింత పెరుగుతుందన్న ఆశతో అన్నదాతలు ఎదురుచూస్తున్నారు. ఇప్పటికే పత్తి పంట చేతికి వచ్చిన ఇళ్లలోనే నిల్వ చేసుకుంటున్నారు. కానీ అంతర్జాతీయ మార్కెట్‌లో డిమాండ్, ధరల్లో హెచ్చుతగ్గుల కారణంగా మద్దతును మించి ధర పలుకడం లేదంటున్నారు. వాతావరణ పరిస్థితులతో దిగుబడులు భారీగా తగ్గడంతో నష్టపోవాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఇప్పటికే కొంతమంది రైతులు పత్తి పంటను తొలగించి యాసంగిలో శనగ పంటను సాగు చేస్తున్నారు. అలాగే కూలీల కొరతతో చేతికి వచ్చిన పత్తిని ఏరేందుకు ఇబ్బందులు తప్పడం లేదంటున్నారు. ధర లేకపోవడంతో పంట చేలలోనే వదిలేస్తున్నారు. దీంతో కురుస్తున్న మంచుకు పత్తి బుగ్గలు నేల రాలి పోతున్నాయి. అలాగే రోజుల తరబడి పత్తిని ఏరకపోవడంతో నలుపు భారీ నాణ్యత లేకుండా పోతుందని రైతులు చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో ధర పెరగడం కష్టమేనన్న అభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి.

తప్పిన అంచనాలు

ఎకరాన 7క్వింటాళ్ల దిగుబడులు వస్తాయని అంచనా వేసినా.. ప్రస్తుతం 4నుంచి 5 క్వింటాళ్ల మాత్రమే దిగుబడులు వస్తున్నాయని చెబుతున్నారు. జిల్లాలో 24లక్షల క్వింటాళ్ల దిగుబడి అంచనాలకు గాను ఇప్పటి వరకు 10లక్షల 12 వేల క్వింటాళ్ల పత్తిని కొనుగోలు చేసినట్లు అధికారిక లెక్కల ప్రకారం తెలుస్తుంది. ఇంకా భారీగా పత్తి దిగుబడులు మార్కెట్‌కు రావాల్సి ఉంది. జిల్లాలో ఫిబ్రవరి, మార్చి నెలల్లో దాదాపుగా పత్తి కొనుగోళ్లు ముగిసిపోతాయి. ఈ లెక్కన మరో నాలుగైదు లక్షల క్వింటాళ్లు మాత్రమే మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంటుందని అధికారులు చెబుతున్నారు. మరో రెండు మాసాల్లో పత్తి కొనుగోళ్లు ముగిసిపోయే అవకాశం ఉంది. మిగితా 13 లక్షల క్వింటాళ్లకు పైగా పత్తిని కొనుగోలు చేయాల్సి ఉంది. కానీ ఇప్పుడున్న పరిస్థితుల్లో ఇది సాధ్యమయ్యే పనికాదని వ్యాపార వర్గాలు పేర్కొంటున్నాయి. ప్రతియేటా వ్యవసాయ శాఖాధికారుల అంచనాలు తారుమారు కావడంతో మార్కెట్‌కు ఆశించిన స్థాయిలో పత్తి దిగుబడులు రావడం లేదు. అంచనాలకు అనుగుణంగా ఏర్పాట్లు చేస్తున్నా.. దిగుబడులు రాకపోవడంతో వ్యాపారులు ఎదురుచూడాల్సిన పరిస్థితి ఏర్పడుతోంది. ఇలాంటి పరిస్థితుల్లో పత్తి జిన్నింగ్‌లు నడపడం కష్టమేనని వ్యాపారులు వాపోతున్నారు.

పెరిగిపోతున్న పెట్టుబడి ఖర్చులు


పత్తి పంట సాగుకు పెట్టుబడి ఖర్చులు పెరుగుతున్నా.. ఆశించిన స్థాయిలో ఆదాయం రావడం లేదంటున్నారు. పత్తిని సాగు చేయాలంటే పెద్ద సాహసమే చేయాల్సి వస్తోందని రైతులు పేర్కొంటున్నారు. ఈ యేడు భారీ వర్షాలు, వరదల కారణంగా వేల ఎకరాలలో పంట నష్టపోవాల్సి వచ్చిందని, ఉన్న కాస్త పంటను కాపాడుకున్నా.. ఆశించిన దిగుబడులు రాలేదంటున్నారు. యేటా పెట్టుబడులు పెరిగిపోతున్నా.. దాననుగుణంగా మద్దతుధర పెరగక పోవడంతో గిట్టుబాటు కావడం లేదంటున్నారు. పత్తికి ప్రత్యామ్నాయంగా ఇతర పంటలను సాగు చేసే అవకాశం లేకపోవడంతో సంప్రదాయ పంటగా పత్తినే సాగు చేయాల్సి వస్తుందని రైతులు పేర్కొంటున్నారు. ఎకరాన రూ.20 నుంచి రూ.30 వేల వరకు పెట్టుబడి ఖర్చులు పోగా.. ఆదాయం మాత్రం అంతంతమాత్రంగానే వస్తుందని చెబుతున్నారు. ఇలాంటి పరిస్థితుల్లో వ్యవసాయం చేయడం కష్టసాధ్యంగానే మారిందంటున్నారు. ప్రభుత్వం పెట్టుబడి ఖర్చులకు అనుగుణంగా మద్దతు ధరను పెంచకపోవడమే అసలుకారణమంటున్నారు.

ఈయేడు చివరికి 16లక్షల క్వింటాళ్ల వరకు పత్తి రావొచ్చు

: శ్రీనివాస్, జిల్లా మార్కెటింగ్ శాఖ అధికారి, ఆదిలాబాద్



జిల్లాలో పత్తి కొనుగోళ్లు నెమ్మదిగా సాగుతున్నాయి. ఇప్పటి వరకు 10లక్షల 12వేల క్వింటాళ్లు మాత్రమే కొనుగోలు చేశాం. ఈ యేడు 24 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు వస్తాయని అంచనా వేశాం. కానీ ఆశించినస్థాయిలో పత్తి మార్కెట్‌కు రావడం లేదు. చివరి వరకు 16 లక్షల క్వింటాళ్ల పత్తి దిగుబడులు మార్కెట్‌కు వచ్చే అవకాశం ఉంది. దిగుబడులు తగ్గడమే ఈ పరిస్థితికి ప్రధాన కారణం. పొరుగు రాష్ట్రమైన మహారాష్ట్రలోనూ ఇదే పరిస్థితి ఉంది.



సంక్షిప్త సమాచారం



సీతక్క సమక్షంలో పార్టీలో చేరుతున్న నాయకులు

'గెలుపే లక్ష్యంగా కృషి చేయాలి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 10: రాష్ట్రంలో వచ్చే ఎన్నికల్లో కాంగ్రెస్ గెలుపే లక్ష్యంగా ప్రతీఒక్కరు కృషి చేయాలని ఆదిలాబాద్ అసెంబ్లీ ఇన్‌చార్జీ కంది శ్రీనివాస్‌రెడ్డి, డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డిలు అన్నారు. నియోజకవర్గంలోని పలువురు గిరిజన సర్పంచ్, ఎంపీటీసీలు, ఐటీడీఏ డైరెక్టర్లు, బీఆర్‌ఎస్‌సీనియర్ నాయకులు ఆ పార్టీకి రాజీనామా చేశారు. బుధవారం ప్రజాసేవ భవన్ నుంచి మంత్రి సీతక్క సమక్షంలో చేరేందుకు బయలుదేరారు. ఈ సందర్భంగా వారిని స్వాగతించారు. డీసీసీబీ ఛైర్మన్ అడ్డిబోజారెడ్డి మాట్లాడుతూ పదేళ్ల పాటు బీఆర్‌ఎస్‌లో కొనసాగిన సర్పంచ్, నాయకులు నేడు కాంగ్రెస్‌లో చేరేందుకు ముందుకు రావడం శుభపరిణామమన్నారు. గ్రామ, పట్టణ, జిల్లా స్థాయిలో పార్టీని మరింత బలోపేతం చేసే దిశగా ప్రతి ఒక్కరు కృషి చేయాలన్నారు. మరికొంత మంది కౌన్సిలర్లు కాంగ్రెస్‌లో చేరేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ఇందులో బాలూరి గోవర్ధన్‌రెడ్డి, శ్రీకాంత్ రెడ్డి, గణపతి, వెంకట్‌రెడ్డ, ఉయిక ఇందిరా, సుజాత్‌అలీ, తదితరులు పాల్గొన్నారు.

'సేవాలాల్ జయంతిని సెలవు దినంగా ప్రకటించాలి'

బోథ్, జనవరి 10: ఫిబ్రవరి 15న బంజారాల ఆరాధ్య దైవం అయిన సేవాలాల్ జయంతిని ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించాలని బోథ్ తాలూకా గోర్ సేన కమిటీ సభ్యులు కోరారు. ఈ మేరకు బుధవారం ఎమ్మెల్యే జాదవ్ అనిల్‌కు వినతి పత్రం అందించారు. ప్రభుత్వం సెలవు దినంగా ప్రకటించకపోతే ఈ విషయమై రాష్ట్రవ్యాప్తంగా ఆందోళన కార్యక్రమాలు చేపడతామని పేర్కొన్నారు.

స్టడీ మెటీరియల్ అందజేత

బోథ్, జనవరి 10: సోనాల మండల పరిషత్ ప్రభుత్వ పాఠశాలలో నాల్గవ తరగతి విద్యార్థులకు బుధవారం పూలే వెల్ఫేర్ సొసైటీ అధ్యక్షుడు గాజుల పోతన్న స్టడీ మెటీరియల్ అందించారు. ఈ సందర్భంగా అయన మాట్లాడుతూ తమ వెల్ఫేర్ సొసైటీ ఆధ్వర్యంలో విద్యార్థులకు ముందుముందు మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామన్నారు. విద్యార్థులు ఉన్నతులుగా ఎదిగేందుకు తమవంతు కృషి చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో సొసైటీ ప్రధాన కార్యదర్శి రమేష్, బత్తుల ఉపాధ్యక్షులు తుమ్మ శ్రీధర్, గౌరవ అధ్యక్షులుగాసాయి కృష్ణ, కార్యదర్శులు పార్డీ కొల్లూరు అనిల్, సలహాదారులు బాసెట్టి రమేష్, విజయ భాస్కర్‌రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

బోథ్: సోనాల గ్రామానికి చెందిన భగత్ దీపిక అనే యువతి పోలీస్ కానిస్టేబుల్ ఉద్యోగానికి ఎంపిక కావడంతో గ్రామంలోని పూలే వెల్ఫేర్‌సొసైటీ ఛైర్మన్ గాజుల పోతన్న ఆమెను సొసైటీ ఆధ్వర్యంలో సన్మానించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ కష్టపడి ఉద్యోగాలు సంపాదించిన యువతిని ఆదర్శంగా తీసుకుని విద్యార్థినులు ముందుకు రావాలన్నారు. సొసైటీ ఆధ్వర్యంలో మహిళల చదువులకు సహకారం అందిస్తామని వారు పేర్కొన్నారు.

నెల రోజుల్లో అందుబాటులోకి టీ హబ్

● వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ కర్ణన్ ● ఉట్నూర్‌లో టీ హబ్ పరిశీలన ● పీఎంఆర్సీలో అధికారులతో సమీక్షా సమావేశం



ఉట్నూర్ ఆసుపత్రిని సందర్శించిన కమిషనర్ ఆర్‌వీ కర్ణన్



హాజరైన ఆదిలాబాద్, కేబీ ఆసిఫాబాద్ జిల్లాల అధికారులు, వైద్య సిబ్బంది

ఉట్నూర్, జనవరి 10: మండలకేంద్రలోని కమ్యూనిటీ హెల్త్ సెంటర్ సమీపంలో రూ.95 లక్షలతో నిర్మాణం పూర్తి చేసిన తెలంగాణ డయగ్నోస్టిక్ సెంటర్‌ను అందుబాటులోకి తెస్తామని రాష్ట్ర వైద్య ఆరోగ్యశాఖ కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. బుధవారం ఆదిలాబాద్ జిల్లా ఉట్నూర్ మండలకేంద్రంలోని టీ హబ్‌ను పరిశీలించారు. ఉమ్మడి జిల్లాలోని ఏజెన్సీ ప్రాంతాల ప్రజలకు కావాల్సిన రక్త పరీక్షల కోసం టీ హబ్‌ను అందుబాటులోకి తెస్తున్నామని అన్నారు. భవన నిర్మాణం పూర్తయిందని, కావాల్సిన పరికరాలను తెప్పించి ల్యాబ్ టెక్నీషియన్‌లను నియమిస్తామని అన్నారు. అక్కడే ఉన్న జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి నరేందర్‌రాథోడ్‌ను ల్యాబ్ టెక్నీషియన్‌లను వెంటనే నియమించాలని ఆదేశించారు. గిరిజన ప్రాంతాల ప్రజలకు అవసరమైన రక్త పరీక్షలు నిర్వహించి మెరుగైన వైద్య సేవలు అందించాలని ఆదేశించారు.

● ఎన్‌ఆర్‌సీ నిర్వహణ పట్ల అసంతృప్తి

ఉట్నూర్ కమ్యూనిటీ ఆసుపత్రి ఆవరణలో ఉన్న పౌష్టిక ఆహార పునరావస కేంద్రాన్ని సందర్శించి అసంతృప్తి వ్యక్తం చేశారు. పునరావాస కేంద్రంలో పిల్లల సంఖ్య తక్కువగా ఉండడంతో అంగన్‌వాడీలు, ఆశల ద్వారా గ్రామాలలో ఉన్న రక్తలేమి వారిని గుర్తించి ఎన్‌ఆర్‌సీలో అడ్మిట్ చేసేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఏజెన్సీ ప్రాంతాలలో రక్తహీనతతో చాలామంది బాధపడుతున్నారని వారిని గుర్తించి వారికి సక్రమంగా పౌష్టికాహారం అందించాలని ఆదేశించారు. ఈ సందర్భంగా ఉట్నూర్ ఆసుపత్రిలోని ప్రసవ గదిని పరిశీలించి ప్రతి నెల ఎన్ని ప్రసవాలు జరుగుతున్నాయని అడిగి తెలుసుకున్నారు. బాలింతతో మాట్లాడి వైద్య సిబ్బంది అందిస్తున్న సేవల గురించి తెలుసుకున్నారు. కమిషనర్‌తో పాటు జాయింట్ డైరెక్టర్లు పద్మ, శ్రీనివాస్‌లు ఉన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి రాథోడ్ నరేందర్, ఏడీఎంహెచ్‌వో డాక్టర్ కుంరబాలు, డీడీఎంహెచ్‌వో డాక్టర్ విజయ్‌కుమార్, వైద్యులు మహేందర్, కపిల్, సంజయ్, మాలతి, రత్నమాలలు, తదితరులు పాల్గొన్నారు.

● ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు పెంచాలి

ఉట్నూర్: ఉమ్మడ జిల్లాలోని ఆదిలాబాద్, ఆసిఫాబాద్ ప్రాంతాల్లో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాల సంఖ్య పెంచాలని రాష్ట్ర వైద్య ఆరోగ్య, కుటుంబ సంక్షేమ శాఖ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్ అన్నారు. బుధవారం ఉట్నూర్ మండల కేంద్రంలోని కొమురంభీం ప్రాంగణంలో ఉన్న పీఎంఆర్సీ సమావే శమందిరంలో రెండు జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడారు. ప్రభుత్వ ఆసుపత్రుల్లో ప్రసవాలు అంతంత మాత్రంగా జరుగుతున్నాయని, ఆసిఫాబాద్ జిల్లా కేంద్రంలో మెడికల్ కాలేజీ ఉన్న ప్రసవాలు సరిగ్గా జరుగడం లేదని విచారం వ్యక్తం చేశారు. ప్రసవాలకు కావాల్సిన మత్తు డాక్టర్లు, స్త్రీ వైద్య నిపుణులను నియమించడానికి కృషి చేస్తామన్నారు. ఈ సమావేశంలో జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్, ఐటీడీఏ పీఓ చాహత్‌బాజ్‌పాయి, స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఖుష్బుగుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ ట్రైనీ వికాస్, జాయింట్ డైరెక్టర్ పద్మతో పాటు రెండు జిల్లాల వైద్య ఆరోగ్యశాఖ అధికారులు, డాక్టర్లు పాల్గొన్నారు.

కోర్టా-చనకా బ్యారేజ్ నిర్మాణం ద్వారా కమీషన్‌లు : ఎమ్మెల్యే పాయల

జైనథ్, జనవరి 10: రాష్ట్రంలో గతంలో అధికారంలో ఉన్న సీఎం కేసీఆర్ బీఆర్‌ఎస్ ప్రభుత్వం జైనథ్ మండలంలోని కోర్టా-చనకా బ్యారేజ్ ద్వారా బీఆర్‌ఎస్ మంత్రులు, ఎమ్మెల్యేలు కమిషన్‌లను అందుకున్నారని ఆదిలాబాద్ ఎమ్మెల్యే పాయల శంకర్ తీవ్రస్థాయిలో ఆరోపించారు. బుధవారం జైనథ్ మండలంలోని కోర్టా-చనకా బ్యారేజ్‌ను సందర్శించి పనులను ఆయన పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ బ్యారేజ్ ద్వారా జైనథ్ బేల ఆదిలాబాద్ మండలాలకు సంబంధించిన 51వేల ఎకరాలకు సాగునీరు అందించే విధంగా ఇప్పుడు అధికారంలోకి వచ్చిన సీఎం రేవంత్‌రెడ్డి, కాంగ్రెస్ ప్రభుత్వం తగు చర్యలు తీసుకోవాలన్నారు. ఎమ్మెల్యే వెంట బీజేపీ నాయకులు లోక ప్రవీణ్, గోర్ల రాము, సంతోష్‌లతో పాటు ఇరిగేషన్ అధికారులు పాల్గొన్నారు.



కోర్టా-చనకా బ్యారేజ్ అధికారులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే



ఎమ్మెల్యే అనిల్ జాదవ్‌తో సెల్ఫీలు దిగుతున్న విద్యార్థులు

'మారుమూల గ్రామాలే అభివృద్ధే ధ్యేయం'

బజార్‌హత్నూర్, జనవరి10: నియోజక వర్గం పరిధిలో మారుమూల గ్రామాలే అభివృద్ధే ధ్యేయంగా ముందుకు సాగుతానని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ అన్నారు. బుధవారం మండలంలోని గులాబ్ తండా నుంచి ఏసాపూర్ గ్రామం వరకు రూ.కోటి నిధులతో బీటీ రోడ్డు పనులను ఆయన మాపీ ఎంపి గోడం నగేష్‌తో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రతి గ్రామానికి రవాణా సౌకర్యం ఉన్నపుడే కావల్సిన అవసరాలను తీర్చుకుంటారని, అందులో భాగంగానే రోడ్డు సౌకర్యాలను కల్పించేందుకు కృషి చేస్తున్నామన్నారు. ఇందులో గులాబ్‌తండా సర్పంచ్ విద్యాసాగర, జడ్పీటీసీ మల్లెపూల నర్సయ్య, ఎంపీటీసీ పండుగ మురళి, కాంగ్రెస్ మండల అధ్యక్షుడు పాండురంగ్, తదితరులున్నారు.

బజార్‌హత్నూర్: మండలకేంద్రంలోని జిల్లా పరిషత్ సెకండరీ పాఠశాలలో జడ్పీ నిధులు రూ.2లక్షలతో కంప్యూటర్ ల్యాబ్‌ను ఎమ్మెల్యే ప్రారంభించారు. అనంతరం విద్యార్థులు ఎమ్మెల్యేతో సెల్ఫీలు తీసుకునేందుకు ఎగబడ్డారు.



డాటా ఎంట్రీని పరిశీలిస్తున్న కలెక్టర్ రాహుల్‌రాజ్

ఉట్నూర్ ఎంపీడీవో కార్యాలయం తనిఖీ

ఉట్నూర్, జనవరి 10: కలెక్టర్ రాహుల్‌రాజ్ బుధవారం మండల కేంద్రంలోని మండల పరిషత్ అభివృద్ధి అధికారి కార్యాలయాన్ని ఆకస్మీకంగా తనిఖీ చేశారు. ప్రభుత్వ ఆదేశాల మేరకు ఇటీవల నిర్వహించిన ప్రజాపాలన గ్రామసభలలో వచ్చిన అర్జీలను డాటా ఎంట్రీని పరిశీలించారు. ఎలాంటి తప్పులు దొర్లకుండా పకడ్బందీగా ఎంట్రీ చేయాలని అధికారులను ఆదేశించారు. నిర్ధీత గడువులోగా ఉట్నూర్ మండలంలో వచ్చిన దరఖాస్తులన్నింటినీ కంప్యూటరీకరణ చేయాలని ఆదేశించారు. కలెక్టర్ వెంట స్థానిక సంస్థల అడిషనల్ కలెక్టర్ ఖుష్బుగుప్తా, అసిస్టెంట్ కలెక్టర్ వికాస్, ఎంపీడీవో బోడ తిరుమల, ఎంపీవో మహేశ్‌కుమార్, తదితరులు ఉన్నారు.

● మొక్కలు నాటిన కలెక్టర్

కొమురంభీం ప్రాంగణం సుందరీకరణ కార్యక్రమంలో భాగంగా బుధవారం ఉట్నూర్ వచ్చిన జిల్లా కలెక్టర్ రాహుల్‌రాజ్ పీఎంఆర్సీ విశ్రాంతి గృహం ముందు మొక్కలు నాటారు. కలెక్టర్ వెంట ఐటీడీఏ పీవో, అడిషనల్ కలెక్టర్, అసిస్టెంట్ కలెక్టర్, పీహెచ్‌వో, సందీప్, తదితరులు పాల్గొన్నారు.



పంటను పరిశీలిస్తున్న జిల్లా వ్యవసాయ అధికారి

శనగ పంటను పరిశీలించిన పుల్లయ్య

నేరడిగొండ, జనవరి 10: మండలంలోని సావర్గాం గ్రామంలోని శనగ పంటను జిల్లా వ్యవసాయ అధికారిడి పుల్లయ్య పరిశీలించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జిల్లాలో యాసంగిలో శణగ పంట అత్యధికంగా పండిస్తున్నారని అన్నారు. శనగలో కొన్ని చోట్ల శనగ పచ్చపురుగు/లద్దె పురుగు సోకిందని, నివారణకు నోవల్యురాన్ లేదా ఇమామెక్టిన్ బెంజో యెట్ అనే మందులను పిచికారి చేసుకోవాలన్నారు. రైతులు వ్యవసాయ అధికారుల సూచనలు పాటించాలన్నారు. మండల వ్యవసాయ అధికారి భాస్కర్, ఏఈవో జైపాల్, రైతులు నారాయణ, గంగయ్య, తదతరులు పాల్గొన్నారు.

'ఖాళీలను భర్తీ చేయకుండా పని భారం'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 10: గత ప్రభుత్వం ఆర్టీసీలో యూనియన్లు లేకుండా చేసి కార్మికులపై అదనపు పని భారం మోపిందని ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహిమూద్ అన్నారు. బుధవారం యాదవ సంఘ భవనంలో ఐఎన్‌టీయూసీ అనుబంధ ఎస్‌డబ్ల్యుయూ సంగ సమావేశాన్ని నిర్వహించారు. దీనికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పలు అంశాలపై చర్చించారు. ఈ సందర్భంగా ఐఎన్‌టీయూసీ రాష్ట్ర వర్కింగ్ ప్రెసిడెంట్ సయ్యద్ మహిమూద్ మాట్లాడుతూ కార్మికుల సమస్యల పై సీఎం రేవంత్‌రెడ్డికి విన్నవించడం జరిగిందన్నారు. గత ప్రభుత్వం ఆర్టీసీలో సంఘాలు లేకుండా చేసిందన్నారు. హక్కుల సాధనలో సంఘాలే కీలకంగా ఉంటాయన్నారు. ఈ ప్రభుత్వంలో కార్మికులకు అంతా మంచి జరుగుతుందని భారోసా ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర, జిల్లా నాయకులు అబ్రహం, గోపాల్, రాజారెడ్డి, సాయిరెడ్డి, ఆదన్న, రమణ, రమేష్, ఎన్‌వీకే రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులతో కలిసి భోజనం చేస్తున్న ఎమ్మెల్యే పాయల

గత ప్రభుత్వం తప్పిదంతో విద్యార్థులకు ఇబ్బందులు : ఎమ్మెల్యే శంకర్

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 10: గత ప్రభుత్వ నిర్లక్ష్యమో? అధికారుల పర్యవేక్షణ లోపమో? కానీ ఆశ్రమ పాఠశాల వసతి గృహాల విద్యార్థులకు శాపంగా మారిందని ఎమ్మెల్యే పాయల శంకర్ ఆరోపించారు. బుధవారం పట్టణంలోని కోలాం ఆశ్రమ పాఠశాలను ఆయన సందర్శించారు. ఈ సందర్భంగా విద్యార్థులతో మాట్లాడి వారి సమస్యలను తెలుసుకున్నారు. అనంతరం వారితో కలిసి భోజనం చేశారు. ముందుగా విద్యార్థులకు అందిస్తున్న భోజన మెనూను పరిశీలించి వివరాలు అడిగి తెలుసుకున్నారు. సిబ్బంది కొరత ఉందని, యూనిఫాం, దుప్పట్లు రాలేదని విద్యార్థులు ఎమ్మెల్యే దృష్టికి తీసు కువచ్చారు. కొంత మంది సిబ్బంది తమకు ఆరు నెలలుగా వేతనాలు లేవని చెల్లించే విధంగా కోరారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ గత ప్రభుత్వం తప్పిదం కారణంగా సాంఘిక సంక్షేమ శాఖ ఆధ్వర్యంలో కొనసాగుతున్న ఆశ్రమ పాఠశాలల్లో విద్యార్థులు ఇబ్బందులు ఎదుర్కొంటు న్నారన్నారు. .రాష్ట్రంలో అత్యధికంగా చలి ఆదిలాబాద్‌లోనే నమోదవుతోం దని, కాని ఇప్పటి వరకు విద్యార్థులకు దుప్పట్లు కూడా రాలేదన్నారు. చలి లోనే చల్లటి నీటితో స్నానాలు చేయాల్సిన దుస్థితి ఉందన్నారు. సరైన వస తులు, సౌకర్యా కార్యక్రమంలో బీజేపీ నాయకులు జోగు రవి, రాకేష్, సూర్య మోహన్, ఉపాధ్యాయులు, తదితరులు న్నారు.



పాఠశాలలో భోజనం రుచి చూస్తున్న ఎమ్మెల్యే అనిల్ జాదవ్

భీంపూర్ అభివృద్ధికి కృషి : ఎమ్మెల్యే అనిల్

భీంపూర్, జనవరి 10: భీంపూర్ మండల అభివృద్ధికి కృషి చేస్తానని బోథ్ ఎమ్మెల్యే అనిల్ జాదవ్ అన్నారు. బుధవారం భీంపూర్‌లో రూ. 31 లక్షలతో నిర్మించిన విద్య వనరుల కేంద్రం(ఎంఆర్‌సి) భవనాన్ని ఆయన అధికారు లు, ప్రజాప్రతినిధులతో కలిసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ కొత్త మండలంలో క్రమంగా ప్రభుత్వ కార్యాలయాల భవనా లు నిర్మించేందుకు కృషి చేస్తానన్నారు. (ఎంఆర్‌సి) సిబ్బంది రెండు నెలలు గా వేతనాలు లేవని ఎమ్మెల్యేకు విన్నవించగా సంక్రాంతి పండగ కోసం సహాయం చేస్తామన్నారు. కాంగ్రెస్ ప్రభుత్వం సమగ్ర శిక్ష ఉద్యోగుల వేత నాలు చెల్లించాలని కోరారు. అనంతరం ఆయన భీంపూర్ ఉన్నత పాఠశాల సందర్శించి మధ్యాహ్న భోజనం పరిశీలించారు. కార్యక్రమంలో ఎంపీపీ కుడి మేత రత్నప్రభ సంతోష్, జడ్పీటీసీ కుంరా సుధాకర్, వైస్ ఎంపీపీ గడ్డం లస్మన్న, ఎంఈవో శ్రీకాంత్, ఎంపీడీవో శ్రీనివాస్, డీటీ హరిదాస్, సర్పంచు లు మాడావి లింబాజీ, గుర్ల నరేందర్ యాదవ్, సయ్యద్ భాదర్, పార్టీ కన్వీనర్ మేకల నాగయ్య, తదితరులు పాల్గొన్నారు.

ఆ తర్వాత, బోథ్ ఎమ్మెల్యేగా అనిల్‌జాదవ్ గెలిచేంత వరకు పాదరక్షలు ధరించనని దీక్ష చేపట్టిన బక్కి కపిల్ యాదవ్‌ను దీక్ష ఎమ్మెల్యే దీక్ష విర మింప చేశారు. తాను స్వయంగా తెచ్చిన పాదరక్షలను అందజేశాడు.

'విద్యార్థులు ఆటల్లోనూ రాణించాలి'

బోథ్, జనవరి 10: విద్యార్థులు చదువులతో పాటు ఆట, పాటల్లో రాణిం చాలని ఎమ్మెల్యే జాదవ్ అనిల్ పేర్కొన్నారు. బుధవారం మండలంలోని పొచ్చెర పాఠశాలలో ఏర్పాటైన ఎన్యూవల్ స్పోర్ట్స్ మీట్‌కు ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విద్యార్థులకు చిన్నతనం నుంచే ఆటపాటలపై ఆసక్తి కలిగే విధంగా ఉపాధ్యాయులు కృషి చేయాలన్నారు. మానసిక ఉల్లాసానికి క్రీడలు ఎంతగానో ఉపకరిస్తాయని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విద్యార్థు లు చేసిన నృత్యాలు ఎంతగానో ఆకట్టుకున్నాయి. ఈ కార్యక్రమంలో జడ్పీ టీసీ సంధ్యారాణితో పాటు గ్రామ సర్పంచ్ మల్లేష్, పాఠశాల ప్రధానో పాధ్యాయులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ

'హామీలను విస్మరించినందుకే ఓటమి'

ఆదిలాబాద్ అర్బన్, జనవరి 10: ప్రజా సమస్యల పరిష్కారంలో ప్రభుత్వాలు తీవ్రజాప్యం చూపుతున్నాయని సీపీఎం రాష్ట్ర కార్యదర్శి వర్గ సభ్యుడు జాన్‌వెస్లీ అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని సుందరయ్య భవనంలో సీపీఎం పార్టీ ప్లీనం సమావేశం నిర్వహించారు. ముందుగా పార్టీ జెండాను సీనియర్ నాయకులు బండి దత్తాత్రి ఆవిష్కరించారు. అనంతరం అమర వీరుల చిత్రపటాలు, స్థూపం వద్ద నివాళులర్పించి రెండు నిమిషాల పాటు మౌనం పాటించారు. అనంతరం జాన్‌వెస్లీ మాట్లాడుతూ వాగ్దానాలు, హామీలను విస్మరించిన కారణంగా బీఆర్ఎస్ ఓటమి చెందిందన్నారు. అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ ఇచ్చిన గ్యారెంటీలను అర్హులకు అందేలా చూడాలని ఆయన ఈ సందర్భంగా పేర్కొన్నారు. ఈ ప్లీనంలో ప్రభుత్వ పనితీరు, ప్రజల హక్కుల సాధన కోసం పార్టీ పరంగా ఉద్యమాల నిర్వహణకు కార్యాచరణ రూపొందిస్తామని స్పష్టం చేశారు. కార్యక్రమంలో పార్టీ రాష్ట్ర కమిటీ సభ్యుడు బండారు రవికుమార్, జిల్లా కార్యదర్శి దర్శనాల మల్లేష్, లంక రాఘవులు, సచిన్, శకుంతల, కిరణ్, బొజ్జ ఆశన్న, తదితరులు పాల్గొన్నారు.

'సీసీఐ తెరిచాకే బీజేపీ ఓట్లు అడగాలి'

ఆదిలాబాద్‌అర్బన్, జనవరి10: వచ్చే పార్లమెంట్ ఎన్నికల నాటికి సీసీఐ (సిమెంట్ ఫ్యాక్టరీ) తెరిచి బీజేపీ ఎన్నికల్లో ఓట్లు అడగాలని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యులు బండారు రవికుమార్ అన్నారు. బుధవారం సీసీఐని పునరుద్ధరణ చేయాలని సీపీఎం ఆధ్వర్యంలో జిల్లాకేంద్రంలో నిర్వహించిన నిరసనలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడారు.

నిలిచిన అద్దె బస్సులు.. ప్రయాణికుల పాట్లు

ఉట్నూర్, జనవరి 10: కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ చట్టాన్ని సవరించాలని కోరుతూ ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్లు సమ్మె తలపెట్టడంతో బస్సులు అన్ని ఎక్కడికక్కడ నిలిచిపోయాయి. సంక్రాంతి పండుగ సమీపిస్తున్న వేళ విద్యా సంస్థలకు సెలవులు ప్రకటిస్తుండగా.. అనూహ్య రీతిలో అద్దె బస్సుల డ్రైవర్లు సమ్మె చేయడంతో బుధవారం బస్సుల కొరత ఏర్పడి ప్రయాణికులు తీవ్ర ఇబ్బందులకు గురయ్యారు. ఉట్నూర్ ఆర్టీసీ డిపోలో 30బస్సులు ఉండగా.. 16 అద్దె బస్సులు ఉన్నాయి. ఉట్నూర్ నుంచి ఆదిలాబాద్, చంద్రపూర్, మహోర్, ఉమర్ఖేడ్, ఆసిఫాబాద్ ప్రాంతాలకు ప్రతీరోజు అద్దె బస్సులు నడుస్తున్నాయి. ఇదేకాకుండా ఆదిలాబాద్ డిపో పరిధిలో 59, ఆసిఫాబాద్ డిపో పరిధిలో 46 అద్దె బస్సులు ఉన్నాయి. దీంతో ఈ ప్రాంతాల్లో నడిచే బస్సుల కొరత వల్ల ప్రయాణికులు ఇబ్బందులకు గురయ్యారు.

ఆదిలాబాద్ అర్బన్: కేంద్ర ప్రభుత్వం ఇటీవల తీసుకువచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని రద్దు చేయాలని ఆర్టీసీ అద్దె బస్సుల డ్రైవర్ల సంఘం సలహాదారుడు మజీద్ డిమాండ్ చేశారు. బుధవారం కేంద్రం నిర్ణయానికి వ్యతిరేకంగా అద్దె బస్సు డ్రైవర్లు విధులు బహిష్కరించి ఆందోళన చేపట్టారు. దీంతో ప్రయాణికులకు తీవ్ర ఇబ్బందులు కలిగాయి. ఈ చట్టాన్ని రద్దు చేసే వరకు ఉద్యమాన్ని కొనసాగిస్తామని స్పష్టం చేశారు.

15 మందికి కు.ని. ఆపరేషన్‌లు

బోథ్, జనవరి10: మండల కేంద్రంలోని ప్రభుత్వ ఆసుపత్రిలో బుధవారం 15 మంది మహిళలకు కుటుంబ నియంత్రణ ఆపరేషన్లు పూర్తి చేయడం జరిగిందని ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ రవీంద్ర ప్రసాద్ తెలిపారు. శిబిరంలో డాక్టర్ చైతన్య, శైలజలు పాల్గొని ఆపరేషన్ పూర్తి చేశారన్నారు. మహిళలు, పురుషులు నిర్భయంగా ఆసుపత్రికి వచ్చి ఆపరేషన్‌ను చేసుకోవాలని సూపరింటెండెంట్ తెలిపారు.

మిషన్ భగీరథ పైపుల చోరీ

బోథ్, జనవరి 10: మండలంలోని సోనాల గ్రామంలోని గ్రామ పంచాయతీ కార్యాలయంలో పెట్టిన మిషన్ భగీరథ పైప్‌లతో పాటు వాల్స్ చోరీకి గురికావడంతో బుధవారం ఆర్‌డబ్ల్యూఎస్ ఏఈ పోలీస్‌స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. 2018 సంవత్సరంలో గ్రామ పంచాయితీ పరిధిలో ఉండే ఓ గదిలో సామగ్రిని నిల్వ ఉంచారు. అయితే ఇటీవల సామగ్రి చోరీ అయినట్లు గుర్తించడంతో పోలీస్‌స్టేషన్‌లో ఏఈ ఫిర్యాదు చేశారు. కాగా ఏఈ ఫిర్యాదుతో స్థానిక పోలీసులు గ్రామ పంచాయితీ కార్యాలయంలో పని చేస్తున్న సిబ్బందిని పిలిపించి కేసు విచారణ ప్రారంభించారు. ఏది ఏమైనా గది తాళం పగులగొట్టి దాదాపు పది లక్షల రూపాయల విలువైన సామగ్రి చోరీకి గురి కావడం సంచలనంగా మారింది.

రైతు చేనులో సోలార్ ప్లేట్..

బోథ్: మండలంలోని కౌటా(బి) గ్రామానికి చెందిన కల్లెం మురళీధర్ రెడ్డి అనే రైతు చేనులో నుంచి సోలార్ ప్లేట్ చోరీకి గురైంది. మంగళవారం రాత్రి చోరీ జరిగినట్లు రైతు పేర్కొన్నారు. ఫలితంగా రైతుకు రూ.20 వేల మేరకు నష్టం వాటిల్లింది. కాగా ఈ విషయమై స్థానిక పోలీస్‌స్టేషన్‌లో బుధవారం ఫిర్యాదు చేసినట్లు ఆయన తెలిపారు.

సదర్మాట్ రైతాంగానికి ఖచ్చితంగా నీరందిస్తాం

● మంత్రి ధనసరి అనసూయ సీతక్క

ఖానాపూర్, జనవరి 10 : సదర్మాట్ ఆయకట్టు పరిధిలోని కడెం, ఖానాపూర్ రైతాంగానికి యాసంగి పంటకు ఖచ్చితంగా నీటిని అందజేస్తామని రాష్ట్ర పంచాయతీ రాజ్, స్త్రీ శిశు సంక్షేమ శాఖ మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం ఖానాపూర్ మండలంలోని మేడంపెల్లి గ్రామ శివారులో గల చారిత్రక కట్టడమైన సదర్మాట్‌ను డీసీసీ అధ్యక్షులు శ్రీహరి రావు, స్థానిక ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, మాజీ ఎమ్మెల్యే రేఖానాయక్‌లతో కలిసి మంత్రి సీతక్క సందర్శించారు. ఈ సందర్భంగా యాసంగి పంటకు పూర్తి స్థాయిలో సదర్మాట్ ఆయకట్టుకు నీటిని అందజేయాలని ఎస్ఆర్ఎస్‌పీ అధికారులను మంత్రి ఆదేశించారు. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లాపై ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డికి ప్రత్యేకమైన అభిమానం ఉందని ఖచ్చితంగా ఈ ప్రాంతాన్ని అభివృద్ధి చేస్తారన్నారు. సదర్మాట్ ప్రత్యేక కెనాల్ నిర్మాణం అంశాన్ని సైతం పరిగణలోకి తీసుకుంటామని చెప్పారు. ఈ ప్రాంత రైతాంగానికి రెండు పంటలకు కచ్చితంగా నిరంతరం నీరు అందేలా చర్యలు చేపడతామన్నారు. అవసరమైతే నీటి పారుదల శాఖ మంత్రి ఉత్తం కుమార్‌రెడ్డితో మాట్లాడి ఈ ప్రాంత సాగునీటి సమస్యకు పరిష్కారం చూపుతానన్నారు. ఆమె వెంట జిల్లా కలెక్టర్ ఆశిస్ సంగ్వాన్, నీటి పారుదల శాఖ అధికారులతో పాటు స్థానిక నాయకులు పాల్గొన్నారు.

సదర్మాట్ రైతాంగ రైబెరియన్ హక్కులను కాపాడండి

సదర్మాట్ రైతాంగానికి ఉన్న రైబెరియన్ రైట్స్‌ని కాపాడాలని సీపీఐ ఎంఎల్ ప్రజాపంథా ఉమ్మడి జిల్లా కార్యదర్శి నంది రామయ్య తెలంగాణ మంత్రి సీతక్కను కోరారు.

పాత పెన్షన్ విధానం అమలు చేయాలని వినతి

నిర్మల్ కల్చరల్ : కాంగ్రెస్ పార్టీ ఎన్నికల సందర్భంగా ఇచ్చిన హామీ మేరకు పాతపెన్షన్ విధానం అమలు చేయాలని కోరుతూ మంత్రి సీతక్కకు బుధవారం సీపీఎస్ ఉద్యోగుల సంఘం కోరింది.


సదర్మాట్ వద్ద విలేకరులతో మాట్లాడుతున్న మంత్రి సీతక్క

జీవో 5 రద్దు చేయాలని మంత్రికి ఏబీవీపీ వినతిపత్రం

జీవో నెంబర్ 5 రద్దు చేయాలని కోరుతూ ఏబీవీపీ నాయకులు మంత్రి సీతక్కకు వినతిపత్రం అందజేశారు. జిల్లా పర్యటనకు వచ్చిన సందర్భంగా కన్వీనర్ శివకుమార్ నేతృత్వంలో మంత్రిని కలిశారు. జిల్లాలోని ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక సౌకర్యాలు కల్పించాలని, హాస్టల్ నూతన భవనాలు నిర్మించాలని కోరారు. ట్రిపుల్ ఐటీలో జరుగుతున్న ఆత్మహత్యలపై విచారణ చేపట్టాలని పలు సమస్యలు పరిష్కరించాలన్నారు.

మంత్రి సీతక్కను కలిసిన గుండంపల్లి రైతులు

దిలావర్‌పూర్ : ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని కోరుతూ గుండంపెల్లి రైతులు జిల్లా పర్యటనకు వచ్చిన రాష్ట్ర మంత్రి సీతక్కను కలిసి విజ్ఞప్తి చేశారు. జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా ప్రత్యేక చొరవ తీసుకుని దిలావర్‌పూర్, గుండంపెల్లి గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయించాలని కోరారు.

'ఇథనాల్' రద్దు కోరుతూ సీఎంను కలిసిన దిలావర్‌పూర్ గ్రామస్థులు


సీఎం రేవంత్‌రెడ్డిని కలిసి వినతిపత్రం ఇస్తున్న దిలావర్‌పూర్ గ్రామస్థులు

దిలావర్‌పూర్, జనవరి 10 : గుండంపెల్లి - దిలావర్‌పూర్ గ్రామాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమను రద్దు చేయాలని కోరుతూ దిలావర్‌పూర్ గ్రామస్థులు హైదరాబాద్‌లో సీఎం రేవంత్‌రెడ్డిని కలిశారు. ఈ మేరకు సీఎంకు వినతిపత్రం అందజేశారు. అలాగే పోలీసులు దిలావర్‌పూర్ గ్రామానికి చెందిన అరవై మంది అమాయక రైతులపై అక్రమ కేసులు నమోదు చేశారని, రైతులపై ఉన్న కేసులు వెంటనే ఎత్తివేయాలని విజ్ఞప్తి చేశారు. పచ్చని పంట పొలాల మధ్య నిర్మిస్తున్న ఇథనాల్ పరిశ్రమతో గ్రామాలపై తీవ్ర దుష్ప్రభావం పడుతుందని విన్నవించారు. పరిశ్రమను రద్దు చేయాలని, లేదంటే జనావాసాలు లేని ప్రాంతానికి తరలించేలా చర్యలు తీసుకోవాలని కోరారు. సీఎంను కలిసిన వారిలో డీసీసీ అధ్యక్షుడు కూచాడి శ్రీహరిరావు, సారంగాపూర్ జడ్పీటీసీ పత్తిరెడ్డి రాజేశ్వర్‌రెడ్డి, దిలావర్‌పూర్ ఇథనాల్ పరిశ్రమ వ్యతిరేక పోరాట సమితి సభ్యులు ఉన్నారు.

వివాదాస్పదమైన ఎంపీ ఖానాపూర్ పర్యటన

● అయ్యప్ప ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించిన ఆదిలాబాద్ ఎంపీ
● ఖానాపూర్ క్యాడర్‌కు కనీస సమాచారం ఇవ్వలేదంటూ ఎంపీకి వ్యతిరేకంగా స్థానిక నాయకుల ఆగ్రహం
● విలేకరుల సమావేశం ఏర్పాటు చేసి ఎంపీపై అసంతృప్తిని వెల్లగక్కిన నాయకులు ● రాష్ట్ర అధ్యక్షుడికి ఫిర్యాదు చేయనున్నట్లు వెల్లడి

ఖానాపూర్, జనవరి 10 : ఆదిలాబాద్ ఎంపీ సోయం బాపురావు ఖానాపూర్ పర్యటన బీజేపీ పార్టీలో వివాదాస్పదంగా మారింది. బుధవారం మధ్యాహ్నం ఖానాపూర్ వచ్చిన ఎంపీ సోయం బాపురావు స్థానిక అయ్యప్ప ఆలయంలో ప్రత్యేకపూజలు నిర్వహించారు. అనంతరం ఆలయ అభివృద్ధి కోసం రూ. 20 లక్షల నిధులను మంజూరు చేస్తానని హామీ ఇచ్చారు. రజక సంఘానికి రూ. 10 లక్షలు నిధులు మంజూరు చేస్తానని హామీ ఇచ్చినట్లు రజక సంఘం నాయకులు సట్ల శంకర్ తెలిపారు. అనంతరం నిర్వహించిన లక్ష్మీర్డా కార్యక్రమంలో ఆయన పాల్గొని అక్కడి నుంచి వెళ్లిపోయారు. ఎంపీ ఖానాపూర్‌లో పర్యటించిన విషయాన్ని తెలుసుకున్న స్థానిక బీజేపీ నాయకులు ఖానాపూర్‌లోని బీజేపీ కార్యాలయంలో సాయంత్రం విలేకరుల సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా బీజేపీ అసెంబ్లీ కన్వీనర్ అంకం మహేందర్, బీజేపీ పట్టణ అధ్యక్షుడు నాయిని సంతోష్ తదితరులు మాట్లాడారు. ఎంపీ సోయం బాపురావు కనీసం పార్టీ క్యాడర్‌కు సమాచారం లేకుండా ఖానాపూర్‌లో పర్యటించడాన్ని తీవ్రంగా తప్పుపట్టారు. గత ఏడాది అయ్యన్న ఆలయ అభివృద్ధి కోసం నిధులు మంజూరు చేయాలని ఖానాపూర్ బీజేపీ నేతలు అడిగితే తాజాగా తమకు సమాచారం లేకుండానే ప్రైవేట్ వ్యక్తులకు అభివృద్ధి నిధుల కోసం ప్రొసీడింగ్ ఇస్తానని చెప్పడం ఎంతవరకు సమంజసమన్నారు. పార్లమెంట్ ఎన్నికలు సమీపిస్తున్న వేళ స్థానిక నాయకులకు ఎవరికీ సమాచారం ఇవ్వకుండా ఎంపీ సోయం బాపురావు వివరిస్తున్న తీరు పార్టీకి నష్టం చేస్తుందన్నారు. ఎంపీ వ్యవహరించిన తీరుపై రాష్ట్ర అధ్యక్షులు కిషన్‌రెడ్డికి ఫిర్యాదు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో బీజేపీ అసెంబ్లీ కోకన్వీనర్ నల్ల రవీందర్‌రెడ్డి, ప్రధాన కార్యదర్శి దాసరి శ్రీనివాస్, బీజేవైఎం జిల్లా జనరల్ సెక్రటరీ పుప్పాల ఉపేందర్, జిల్లా కార్యవర్గ సభ్యులు మదిరే శ్రీనివాస్, సీనియర్ నాయకులు తోకల బుచ్చన్న యాదవ్, దాదే మల్లయ్య, పొలసాని అనిల్‌రావు, పిట్టల భూమన్న, మహిళా మోర్చా పట్టణ అధ్యక్షురాలు బొప్పారావు, సత్యవతి, మండల ఉపాధ్యక్షులు ఎనుగందుల రవి, కొప్పుల భీమేష్, పరమేశ్వర్ గౌడ్, సుధాకర్, కంతి లింబాద్రి, ఒడ్నాల రాజేశ్వర్, బెజ్జారపు రాజేశ్వర్, ఆడెపు రంజిత్, సాయి, సురభి రంజిత్, సల్కం వెంకటేష్, తదితరులు పాల్గొన్నారు.


ఖానాపూర్‌లో అయ్యప్ప ఆలయంలో ఎంపీ సోయం బాపురావు

హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళనలు

● విధులను బహిష్కరించి నిరసనలు ● పార్కింగ్‌కే పరిమితమైన అద్దె బస్సులు


అద్దె బస్సు డ్రైవర్ల నిరసన ప్రదర్శన


భైంసా బస్సు డిపో ఎదుట నిలిచిపోయిన అద్దె బస్సులు

భైంసా, జనవరి 10 : కేంద్ర ప్రభుత్వం కొత్తగా తీసుకవచ్చిన హిట్ అండ్ రన్ చట్టాన్ని వ్యతిరేకిస్తూ భైంసా బస్సు డిపో పరిధిలో అద్దె బస్సు డ్రైవర్లు ఆందోళన బాట పట్టారు. బుధవారం వేకువ జాము నుంచి విధులను బహిష్కరించి నిరసనలకు దిగారు. డిపో ప్రవేశ మార్గం ఎదుట హిట్ అండ్ రన్ చట్టాన్ని వెంటనే ఉపసంహరించుకోవాలని ప్రదర్శనలు చేపట్టారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేస్తూ హోరెత్తించారు. దీంతో డిపో పరిధిలోని అద్దె బస్సులన్నీ పార్కింగ్ స్థలాలకే పరిమితమయ్యాయి. భైంసా డిపో పరిదిలో 73 బస్సులు ఉండగా ఇందులో 49 అద్దె బస్సులు, 24 సంస్థ బస్సులున్నాయి. అద్దె బస్సు డ్రైవర్ల ఆందోళనలతో అధిక శాతం రూట్లలో బస్సుల రాకపోకలు నిలిచిపోయాయి. ఈ కారణంగా ఆయా రూట్లలో ఉద్యోగాలకు వెళ్లే ఉద్యోగస్తులతో పాటు ఇతర ప్రయాణీకులు ఇబ్బందులు పడ్డారు. భైంసా బస్సు డిపో మేనేజర్ అమృతతో పాటు ఇతర ఆర్టీసీ అధికారులు అద్దె బస్సు డ్రైవర్లతో చర్చలు జరిపేందుకు చేపట్టిన చర్యలు ఫలించలేదు. మధ్యాహ్నం అద్దె బస్సుల యజమానులతో డిపో నిర్వాహణాధికారులు చర్చలు జరిపారు. అనంతరం యజమానులు తమ తమ బస్సు డ్రైవర్లను విధుల్లో చేరాల్సిందిగా విజ్ఞప్తి చేసినప్పటికి స్పందన కానరాలేదు. ఈ సందర్భంగా అద్దె బస్సు డ్రైవర్ల సంఘం ప్రతినిధులు మాట్లాడుతూ కేంద్ర ప్రభుత్వం హిట్ అండ్ రన్ చట్టాన్ని ఉపసంహరించేంత వరకు తమ ఆందోళనలను విరమించబోమని వెల్లడించారు.

ఉపాధ్యాయుల సమస్యల

పరిష్కారానికి అంకితభావంతో పాటుపడుతా


.పీఆర్‌టీయూ ప్రతినిధులతో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్

భైంసా, జనవరి 10: దీర్ఘకాలికంగా ఉపాధ్యాయులు ఎదుర్కొంటున్న సమస్యలను ప్రభుత్వం దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింపచేసేందుకు అంకితభావంతో పాటుపడుతానని ముథోల్ ఎమ్మెల్యే పవార్ రాంరావ్ పాటిల్ పెర్కొన్నారు. బుధవారం పీఆర్‌టీయూ నూతన సంవత్సర క్యాలెండర్ అవిష్కరణ కార్యక్రమంలో పాల్గొని మాట్లాడారు. ఉపాధ్యాయులు విద్యార్థులను నిష్ణాతులుగా తీర్చిదిద్ది వారి భవిష్యత్తును బంగారుమయం చేసేందుకు చిత్తశుద్ధితో కృషి చేయాలన్నారు.రానున్న రోజుల్లో ఉపాధ్యాయుల పదోన్నతులు, బదిలీలకు కృషి చేస్తానన్నారు. 317 జీవో మూలంగా స్థానికత కోల్పోయిన ఉపాధ్యాయులకు స్వంత జిల్లాలకు బదిలీలు చేయించడానికి , సీపీఎస్ రద్దుకు, పదోన్నతులపై టెట్ విషయాలను ముఖ్యమంత్రి దృష్టికి తీసుకవెళ్లి పరిష్కరింప చేసేందుకు బాధ్యతాయుతంగా చర్యలు చేపడుతానని పెర్కొన్నారు. ఇందులో పీఆర్‌టీయూ జిల్లా ప్రధాన కార్యదర్శి బీ.వీ.రమణరావ్, డివిజన్ పరిధిలోని ఆయా మండలాల కార్యవర్గ ప్రతినిధులు పాల్గొన్నారు.

రూ. 2 లక్షల మద్యాన్ని స్వాధీనం చేసుకున్న పోలీసులు

భైంసా రూరల్, జనవరి 10 : మండలంలోని వానల్‌పాడ్ గ్రామంలో బుధవారం బెల్ట్‌షాప్ నిర్వహిస్తున్న జగన్ అనే వ్యక్తి నుండి రూ.2 లక్షల మద్యాన్ని స్వాధీనం చేసుకున్నారు. ఈ మేరకు అతనిపై కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తామని ఎస్సై శ్రీకాంత్ తెలిపారు.

అప్పుల బాధతో రైతు ఆత్మహత్య

భీంపూర్, జనవరి 10 : అప్పులబాధతో ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్న ఘటన మండలంలో చోటుచేసుకుంది. వివరాల్లోకి వెళ్ళే.కుటుంబీకులు, పోలీసుల కథనం ప్రకారం భీంపూర్ మండలం పిప్పల్‌కోటి గ్రామానికి చెందిన ఎడిపెల్లి రమేష్(54) అనే రైతు బుధవారం రాత్రి తన ఇంట్లో దూలానికి ఉరి వేసుకుని ఆత్మహత్య చేసుకున్నాడు. ఆరుగాలం కష్టపడి పండించిన పంట దిగుబడి రాక చేసిన అప్పు తీర్చలేక తీవ్ర మనస్థాపానికి గురై ఆత్మహత్యకు పాల్పడ్డాడని తెలిపారు. మృతుని భార్య దేవుబాయి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు చేస్తున్నట్లు ఎస్సై లాల్‌సింగ్ నాయక్ తెలిపారు.



సీఎంఆర్ పై జడ్పీలో గరం గరం

- జోరుగా రీసైక్లింగ్ జరుగుతుందని సభ్యుల ఆగ్రహం
- రైస్‌మిల్లుల యాజమాన్యాల తీరుపై మండిపాటు
- సీఎంఆర్ బియ్యాన్ని ఆంధ్రాకు తరలిస్తున్నారని ఫైర్
- మన ఊరు - మన బడి నిధులపై అధికారుల నిలదీత

నిర్మల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : కీలకమైన సీఎంఆర్ బియ్యం, మన ఊరు - మనబడి, ఇరిగేషన్ శాఖలకు సంబంధించిన పలు పనులపై జడ్పీ సమావేశంలో పలువురు సభ్యులు అధికారుల తీరుపై ధ్వజమెత్తారు. అధికారులు, జడ్పీటీసీల మధ్య వాదోపవాదాలు జరిగాయి. అధికారుల తప్పిదంతోనే అభివృద్ధి కుంటుపడుతోందంటూ పలువురు జడ్పీటీసీలు మండిపడ్డారు. ముఖ్యంగా రైస్‌మిల్లుల్లో జరుగుతున్న సీఎంఆర్ బియ్యం అక్రమాలపై జడ్పీటీసీలు ఓస రాజేశ్వర్, జీవన్‌రెడ్డి, శారదలతో పాటు పలువురు ధ్వజమెత్తారు. ముఖ్యంగా రైస్‌మిల్లుల యజమానులంతా సిండికేట్‌గా ఏర్పడి కోట్ల రూపాయల విలువైన సీఎంఆర్ బియ్యం అక్రమాలకు పాల్పడుతున్నారన్నారు. అధికారులు సైతం రైస్‌మిల్లు యజమానులకే వత్తాసు పలుకుతున్నారంటూ దుయ్యబట్టారు. ముఖ్యంగా రైస్‌మిల్లుల నుంచి పంపిణీ జరుగుతున్న బియ్యం నాణ్యత ఉండడం లేదన్నారు. అంగన్వాడీ కేంద్రాలు, ప్రభుత్వ పాఠశాలలకు పంపిణీ చేస్తున్న బియ్యంలో పురుగులు వస్తున్నాయని, తూకంలో భారీగా తేడాలు ఉంటున్నాయని వారు పేర్కొన్నారు. సీఎంఆర్ కోసం ఇచ్చిన వడ్లను రైస్‌మిల్లు యజమానులు ఆంధ్రాకు తరలిస్తున్నారని ఆరోపించారు. ఈ సందర్భంగా పౌర సరఫరాల శాఖ మేనేజర్ శ్రీకళ మాట్లాడుతుండగా పలువురు జడ్పీటీసీలు ఆమెను అడ్డుకున్నారు. కోట్లాది రూపాయల్లో అక్రమాలు జరుగుతుంటే ఎలాంటి చర్యలు తీసుకోకుండా సమర్థించుకునే ప్రయత్నం చేయడం సరికాదన్నారు. వెంటనే సీఎంఆర్ బియ్యం అక్రమాలపై విచారణ జరిపిచర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం విద్యాశాఖ పనితీరుపై సైతం పలువురు జడ్పీటీసీలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మనఊరు - మనబడి పథకం కింద ఎంపిక చేసిన పాఠశాలలను పట్టించుకోవడం లేదని వారు ఆరోపించారు. నిధులు సైతం సక్రమంగా విడుదల చేయడం లేదన్నారు. దీనిపై డీఈవో రవీంధర్‌రెడ్డి మాట్లాడుతూ మొదటి విడత కింద 260 పాఠశాలలను ఎంపిక చేశామని, ప్రస్తుతం ఆ పాఠశాలల్లో పనులు కొనసాగుతున్నాయంటూ సమాధానం ఇచ్చారు. ఎన్నికల కారణంగా పనుల నిర్వహణలో ఆలస్యం జరిగిందని తెలిపారు. కాగా చేసిన పనులకు సంబంధించిన బిల్లులు పెండింగ్‌లో ఉన్నాయని వివరించారు. ఇటీవల కురిసిన భారీ వర్షాల వల్ల దెబ్బ తిన్న చెరువుల మరమత్తులను ఇప్పటి వరకు ఎందుకు చేయడం లేదంటూ జడ్పీటీసీలు ఇరిగేషన్ ఈఈ రామారావును నిలదీశారు. భైంసా సమీపంలోని సిరాల ప్రాజెక్టు, కడెం ప్రాజెక్టు, సదర్‌మాట్, సరస్వతీ కాలువ లాంటి వాటి మరమ్మతుల కోసం నిధులు మంజూరు చేయకపోవడం శోచనీయమన్నారు. ఈ సందర్భంగా ఈఈ రామారావు జోక్యం చేసుకొని సిరాల ప్రాజెక్టు మరమ్మతుల కోసం రూ.17 కోట్లతో ప్రతిపాదనలు రూపొందించామన్నారు. ఈ సారి కడెం ప్రాజెక్టు కింద క్రాఫ్ హాలీడే ఇచ్చామన్నారు. ప్రస్తుతం ప్రాజెక్టులో ఉన్న నీరు మిషన్ భగీరథకు మాత్రమే సరిపోతుందని, పంటలకు నీరందించడం సాధ్యం కాదన్నారు. కాగా కడెం ఎంపీపీ సింగారి కిషన్ మాట్లాడుతూ కడెం ప్రాజెక్టు కింద రైతులు నారుమడులు వేసుకున్నారని రైతులు నష్టపోతే ఊరుకోబోమని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ఈఈ రామారావు మాట్లాడుతూ ఆయకట్టు రైతులకు నీరందించే పరిస్థితి లేదందున వారంతా సహకరించాలన్నారు. సదర్‌మాట్ కింద మొత్తం 13,500 ఎకరాలు సాగవుతుండగా, ఎస్సారెస్పీ ప్రాజెక్టులో నీటిమట్టం తక్కువగా ఉండడంతో కేవలం 10వేల ఎకరాలకు మాత్రమే సాగునీరు అందించేందుకు నిర్ణయించామన్నారు. స్వర్ణప్రాజెక్టు కింద కూడా కేవలం 3500 ఎకరాలకు మాత్రమే సాగునీరును అందించేందుకు ప్రయత్నిస్తున్నామన్నారు. అలాగే పలువురు జడ్పీటీసీలు, ఎంపీపీలు మాట్లాడుతూ ప్రభుత్వ పరంగా అమలయ్యే అన్ని సంక్షేమ అభివృద్ధి పథకాల అమలులో నిర్లక్ష్యం జరగకుండా చూడాల్సిన బాధ్యత అధికారులదేనన్నారు. ఈ సమావేశానికి జడ్పీ ఛైర్‌పర్సన్ అధ్యక్షత వహించగా కలెక్టర్ అశిష్ సంగ్వాన్, అడిషనల్ కలెక్టర్ ఫైజాన్ అహ్మద్‌లు పాల్గొన్నారు.

హాజరుకాని ఎమ్మెల్యేలు

కాగా నిర్మల్ జడ్పీ సమావేశానికి కొత్తగా ఎన్నికైన నియోజకవర్గంలోని ముగ్గురు ఎమ్మెల్యేలు హాజరుకాకపోవడం చర్చనీయాంశంగా మారింది. నిర్మల్ ఎమ్మెల్యే ఏలేటీ మహేశ్వర్‌రెడ్డి, ముథోల్ ఎమ్మెల్యే రామారావు పటేల్, ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మబొజ్జులు తమ మొదట జడ్పీ సమావేశానికి హాజరుకాకపోవడం పట్ల భిన్నాభిప్రాయాలు వ్యక్తమవుతున్నాయి. ఎమ్మెల్యేలు సమావేశానికి హాజరై తమ తమ నియోజకవర్గ పరిధిలోని సమస్యల పరిష్కారం కోసం చర్చించినట్లయితే ప్రయోజనం ఉండేదని చెబుతున్నారు. కాగా జిల్లాలో మంత్రి సీతక్క పర్యటన కారణంగా వెడ్మబొజ్జు సమావేశానికి హాజరుకానట్లు తెలిసింది. బీజేపీ చెందిన ఎమ్మెల్యేలు మహేశ్వర్‌రెడ్డి, రామారావు పటేల్‌లు మాత్రం జడ్పీ సమావేశానికి హాజరుకాకపోవడం చర్చకు తావిస్తోంది. వీరిద్దరు స్థానికంగానే అందుబాటులో ఉన్నప్పటికి కీలకమైన జడ్పీ సమావేశానికి హాజరైతే ఆయా నియోజకవర్గాలకు కొంతమేరకైనా ప్రయోజనం చేకూరేదంటున్నారు.

సమస్యలపై సీరియస్‌గా చర్చ

జడ్పీ సర్వసభ్య సమావేశంలో పలు సమస్యలపై సభ్యులు సీరియస్‌గా చర్చ జరిపారు. ఓ దశలో అధికారులను నిలదీసి వారి నుంచి జవాబు రాబట్టేందుకు ప్రయత్నించారు. సీఎంఆర్ బియ్యం విషయంలో రైస్‌మిల్లు యజమాన్యాలకు సంబంధిత అధికారులు వత్తాసు పలుకుతున్నట్లు ఆరోపించారు. కోట్ల రూపాయల్లో అక్రమాలు జరుగుతున్న అధికారులు ఎందుకు స్పందించడం లేదంటూ వారంతా నిలదీశారు. దీనిపై సంబంధిత అధికారి సమర్థించుకునే ప్రయత్నం చేసినప్పటికి జడ్పీటీసీలు మాత్రం వెనకడుగు వేయకుండా సమాధానం చెప్పాల్సిందేనంటూ పట్టుబట్టారు. సీఎంఆర్ బియ్యంతో పాటు ముఖ్యమైన కడెం ప్రాజెక్టు ఆయకట్టుకు నీటి విడుదల విషయమై సుదీర్ఘంగా చర్చ జరిగింది. ప్రాజెక్టులో నీరు లేని కారణంగా పంటలకు నీరందించడం సాధ్యం కాదంటూ అధికారులు స్పష్టం చేశారు. దీంతో ప్రశ్నించేందుకు సిద్ధమైన ప్రజా ప్రతినిధులు వెనకడుగు వేయాల్సి వచ్చిందంటున్నారు.

పెంచికల్‌పాడ్‌లో చిరుత సంచారం

కుంటాల, జనవరి, 1 : మండలంలోని పెంచికల్‌పాడ్ గ్రామంలో చిరుత సంచరిస్తున్నట్లు అటవీ అధికారులు గుర్తించారు. ఇందుకు సంబంధించిన వివరాల ప్రకారం గ్రామానికిచెందిన పుంద్ర గంగారెడ్డి చేనులో బుధవారం ఉదయం పాలేర్లు చిరుత పక్క వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లడం గమనించారు. అప్రమత్తమైన రైతులు, గ్రామ ఉప సర్పంచ్ కిష్టయ్య అటవీ శాఖ అధికారులకు సమాచారం అందించారు. ఘటన స్థలానికి ఎఫ్ఆర్‌వో రాథోడ్ రమేష్, ఎఫ్‌బీవో హరిలతలు చేరుకొని చిరుత పాదముద్రలు సేకరించారు. రైతులు వ్యవసాయ క్షేత్రంలోకి వెళ్లినప్పుడు అప్రమత్తంగా ఉండాలని ఎలాంటి ఆందోళన చెందవద్దని అవసరమైతే తమకు సమాచారం అందించాలని పేర్కొన్నారు.

హెల్త్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను కలిసిన కలెక్టర్

నిర్మల్ కల్చరల్, జనవరి 10 : రాష్ట్ర ప్రభుత్వ హెల్త్ కమిషనర్ ఆర్‌వీ కర్ణన్‌ను కలెక్టర్ ఆశిష్ సంగ్వాన్ బుధవారం మర్యాదపూర్వకంగా కలిసి పుష్పగుచ్ఛం అందజేశారు. జిల్లాకు వచ్చిన ఆయనకు సాదర స్వాగతం పలికారు.



ఉచిత బస్సు ప్రయాణంతో మహిళల్లో ప్రభుత్వంపై ఆదరణ పెరుగుతోంది

- అది ఓర్వలేకనే ఆటో యూనియన్లను రెచ్చగొడుతున్నారు
- మంత్రి ధనసరి అనసూయ సీతక్క

నిర్మల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : రాష్ట్రంలో ఉచిత బస్సు ప్రయాణంతో ప్రభుత్వంపై మహిళల ఆదరణ పెరుగుతోందని, అది చూసి ఓర్వలేకనే ప్రతిపక్ష బీఆర్ఎస్ పార్టీ నాయకులు ఆటో యూనియన్లను రెచ్చగొడుతున్నారని తెలంగాణ రాష్ట్ర మంత్రి ధనసరి అనసూయ సీతక్క అన్నారు. బుధవారం జిల్లాకేంద్రంలోని రాజరాజేశ్వర గార్డెన్‌లో నిర్వహించిన కాంగ్రెస్ పార్టీ జిల్లా స్థాయి విస్తృత సమావేశానికి ఆమె హాజరై.. రానున్న పార్లమెంట్ ఎన్నికల్లో అనుసరించాల్సిన వ్యూహాలపై కార్యకర్తలకు దిశానిర్దేశం చేశారు. అనంతరం సీతక్క మాట్లాడుతూ.. రాష్ట్రంలో ఆరు గ్యారంటీల హామీని ఇచ్చిన తమ ప్రభుత్వం కచ్చితంగా ఇచ్చిన హామీని అమలు చేసేందుకు కట్టుబడి ఉందన్నారు. అధికారంలోకి వచ్చిన వెంటనే రెండు గ్యారంటీలను అమలు చేసిన ఘనత తమ ప్రభుత్వానికి దక్కిందన్నారు. తప్పుడు ప్రచారాలను తిప్పికొట్టాల్సిన బాధ్యత పార్టీ ప్రతీ కార్యకర్త పైనా ఉందన్నారు. సీఎం రేవంత్‌రెడ్డి ప్రతీ కార్యక్రమాన్ని ఆదిలాబాద్ జిల్లాతోనే ప్రారంభిస్తున్నారని సీతక్క తెలిపారు. ముఖ్యమంత్రి అయ్యాక తొలి పర్యటన సైతం ఆదిలాబాద్ జిల్లా నుంచి ప్రారంభించాలని సీఎం రేవంత్‌రెడ్డి అనుకుంటున్నారని చెప్పారు. ఈ ప్రాంత అభివృద్ధికి సీఎం కట్టుబడి ఉన్నారన్నారు. సాక్షాత్తూ చదువుల తల్లి సరస్వతి దేవి కొలువై ఉన్న నిర్మల్ జిల్లాలోనే ట్రిపుల్ ఐటీ విద్యార్థులు ఎన్ని కష్టాలు పడ్డారో రాష్ట్రమంతా చూసిందన్నారు. విద్యార్థులంతా ఇక ఆందోళన చేయాల్సిన పని లేదని, విద్యార్థుల సమస్యలను వినే ప్రభుత్వం ఏర్పాటైందన్నారు. దేశంలో కాంగ్రెస్ పార్టీని కాపాడేందుకు గాంధీ కుటుంబం ఎంతో శ్రమిస్తుందన్నారు. కేంద్రంలో పార్టీని అధికారంలోకి తెచ్చేందుకు ప్రతీ కార్యకర్త కృషి చేయాలన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ పరిధిలో కాంగ్రెస్ పార్టీకి ఒక్కరే ఎమ్మెల్యే ఉన్నారన్నారు. ఆదిలాబాద్ పార్లమెంట్ సీటును కాంగ్రెస్ గెలవబోతుందన్నారు. ఇందుకోసం గ్రూపులను పక్కనపెట్టి పార్టీ కోసం శ్రమించాలని కార్యకర్తలకు సీతక్క సూచించారు. ఎంపీ ఎన్నికల్లో మీ పనితీరును బట్టే రానున్న స్థానిక సంస్థల ఎన్నికల్లో టికెట్ల కేటాయింపు ఉంటుందన్నారు. ఈ సమావేశంలో ఖానాపూర్ ఎమ్మెల్యే వెడ్మ బొజ్జు, డీసీసీబీ ఛైర్మన్ అడ్డి భోజారెడ్డి, నిర్మల్ డీసీసీ అధ్యక్షుడు శ్రీహరిరావు, మాజీ ఎమ్మెల్యేలు నారాయణ రావు పటేల్, అజ్మీరా రేఖానాయక్, కంది శ్రీనివాస్ రెడ్డి తదితరులు పాల్గొన్నారు.

ఐఆర్ఎస్ అధికారితో మంత్రి సీతక్క భేటీ!

- ఆదిలాబాద్ ఎంపీ టికెట్‌పై చర్చలు ?



రాథోడ్ ప్రకాష్ కుటుంబ సభ్యులతో మంత్రి సీతక్క

నిర్మల్, జనవరి 10 (ఆంధ్రజ్యోతి) : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో.. ఇండియన్ రెవెన్యూ సర్వీస్ (ఐఆర్ఎస్) అధికారి ప్రకాష్ రాథోడ్‌తో ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రి సీతక్క బుధవారం నిర్మల్‌లో భేటీ కావడం కాంగ్రెస్ వర్గాల్లో చర్చనీయాంశంగా మారింది. జిల్లాలోని ముథోల్ నియోజకవర్గానికి చెందిన ఐఆర్ఎస్ అధికారి ప్రకాష్ రాథోడ్ ఆదాయ పన్ను శాఖాధికారిగా కొనసాగుతున్నారు. బుధవారం నిర్మల్ జిల్లా పర్యటనకు వచ్చిన మంత్రి సీతక్క.. ప్రకాష్ రాథోడ్ నివాసానికి వెళ్లి అయనతో భేటీ అయ్యారు. వచ్చే పార్లమెంట్ ఎన్నికల్లో ఆయన ఆదిలాబాద్ నుంచి కాంగ్రెస్ టికెట్‌ను ఆశిస్తున్నారు. గిరిజన లంబాడా సామాజిక వర్గానికి చెందిన ప్రకాష్ రాథోడ్‌కు రాజకీయాల పట్ల ఆసక్తి ఉన్న కారణంగా వచ్చే ఎన్నికల్లో ఆయన ఆదిలాబాద్ పార్లమెంట్ స్థానం నుంచి పోటీ చేస్తానని కాంగ్రెస్ అధిష్ఠానం దృష్టికి తీసుకెళ్లినట్టు సమాచారం. ఈ నేపథ్యంలోనే మంత్రి సీతక్క నేరుగా ఆయన నివాసానికి వెళ్లి భేటీ కావడం ప్రాధాన్యాన్ని సంతరించుకుంది. ఉమ్మడి ఆదిలాబాద్ జిల్లా ఇన్‌చార్జి మంత్రిగా బాధ్యతలు చూస్తున్న సీతక్క పార్లమెంట్ ఎన్నికల్లో బలమైన అభ్యర్థి కోసం ప్రయత్నాలు మొదలుపెట్టారని.. ఇందులో భాగంగానే ఆమె ఐఆర్ఎస్ అధికారితో భేటీ అయినట్లు విశ్వసనీయ సమాచారం.



ఫైనల్స్‌లో ముగ్గులు వేస్తున్న పోటీదారులు



సినీనటి అనన్యతో సెల్ఫీ దిగుతున్న యువతులు, మహిళలు



ప్రథమ స్థానంలో నిలిచిన ముగ్గు వద్ద మహిళలు

ముగ్గుల హరివిల్లు

ఉత్సాహంగా 'ఆంధ్రజ్యోతి-ఏబీఎన్' ముత్యాల ముగ్గుల పోటీ ఫైనల్



ముగ్గు వేస్తున్న పాలకుర్తి ఎమ్మెల్యే యశస్విని



ముగ్గు వేస్తున్న కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి



ముగ్గులను పరిశీలిస్తున్న అతిథులు



ఆంధ్రజ్యోతి-ఏబీఎన్ నిర్వహిస్తున్న కెనరాబ్యాంక్ ముత్యాల ముగ్గుల పోటీలు (పవర్డ్ బై ఎయిమ్స్ విద్యాసంస్థలు, బెంగళూరు.. రియల్ పార్టనర్: స్వర్గసీమ సుకేతన) ఆధ్వర్యంలో బుధవారం హైదరాబాద్‌లో జరిగిన ఫైనల్స్‌లో పోటీదారులు వేసిన ముగ్గులతో ఇంద్రధనస్సు నేలకు దిగి వచ్చిందా అనిపించింది. తెలంగాణవ్యాప్తంగా 45 కేంద్రాల్లో పోటీలు జరగగా, ఉమ్మడి జిల్లా నుంచి ఒకరు ఫైనల్స్‌లో తమ ముగ్గులతో పోటీ పడ్డారు. సినీనటి అనన్య నాగళ్ల, పాలకుర్తి ఎమ్మెల్యే మామిడాల యశస్వినితో పాటు కాంగ్రెస్ నేత ఝాన్సీరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



సినీనటి అనన్య



ముగ్గులు వేస్తున్న మహిళలు





అతిథులకు స్వాగతం పలుకుతున్న ఆంధ్రజ్యోతి నెట్‌వర్క్ ఇన్‌చార్జి కృష్ణప్రసాద్, స్టేట్ బ్యూరో చీఫ్ ఉప్పులూరి మురళీకృష్ణ